
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

ఆదివారం, 30 మార్చి 2025



ప్రగతి పరుగులు

- వేగంగా అభివృద్ధి సాధిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా
- సీఎం సహకారంతో ప్రధాన సమస్యల పరిష్కారం
- శ్రీరామ నవమిలోగా ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి జీవో
- ఉగాది నుంచి రేషన్ కార్డులపై సన్నబియ్యం
- ఖమ్మం-కోదాడ పాత రహదారి మరమ్మతులకు రూ.20 కోట్లు విడుదల
- ప్రజలకు 'విశ్వావసు' నామ శుభాకాంక్షలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏడాది కాలంలోనే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో జిల్లాలోని ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపినట్లు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఫలితంగా ఉమ్మడి జిల్లా వేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటి విడుదలతో పాటు జాతీయ రహదారులు, కొత్తగూడెం ఎయిర్‌పోర్టు, కొత్తగూడెంలో ఎర్త్‌సైన్సెస్ యూనివర్శిటీ, వేంసూరు మండలంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. మిగిలిన సమస్యలకు కూడా త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు.

ఖమ్మం కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎర్త్‌సైన్సెస్ విశ్వవిద్యాలయం రాబోతోందన్నారు. శ్రీరామ నవమిలోగా ప్రభుత్వం నుంచి జీవో విడుదల కాబోతుందన్నారు. ఉమ్మడి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు విశ్వవిద్యాలయం లేనందున ఈ జిల్లాలో అన్నిరకాల ఖనిజ సంపద అపారంగా ఉందని, ఇక్కడున్న భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెంలో ఎర్త్‌సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరానని, ఈ తరహా యూనివర్సిటీ దేశంలో ఎక్కడా లేదని, దీనిపై ముఖ్యమంత్రి కూడా నిపుణులతో నివేదికలు తెప్పించుకుని ఒక మోడల్ యూనివర్శిటీగా (మిగతా 8వ పేజీలో)



విద్యుద్దీపాల వెలుగులో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న భద్రాద్రి రామాలయం

భద్రాద్రికి బ్రహ్మోత్సవ శోభ

- వేడుకలకు నేడు అంకురార్పణ
- ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణోత్సవం
- 12 వరకు రోజుకో వేడుక
- నిత్య కల్యాణాల నిలిపివేత
- నేడు గవర్నర్‌కు, సీఎంకు రాజపత్రాలు

భద్రాచలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతున్న తరుణంలో భద్రాద్రిలో బ్రహ్మోత్సవ శోభ ఉట్టిపడుతోంది. ఎటుచూసినా స్వాగత ద్వారాలు.. చలువ పందిళ్లు.. చాందిని వస్త్రాలంకరణలు.. దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న రామాలయ పరిసరాలు. దీంతో భద్రాచలంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అలాగే ఆదివారం నుంచి వసంతపక్ష ప్రయుక్త నవహ్నిక శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీంతో భద్రాచలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా రామాలయం, కల్యాణ మండపం పరిసర ప్రాంతాలు చలువ పందిళ్లు, చాందినీ వస్త్రాలతో అలంకరిస్తున్నారు. అదేవిధంగా రామాలయానికి విద్యుద్దీపాలంకరణ చేపట్టడంతో దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. అలాగే పట్టణంలోని ప్రధాన కూడళ్లలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడంతో పట్టణానికి సరికొత్త శోభ సంతరించుకొంది. బ్రహ్మోత్సవాల తొలిరోజున శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని (మిగతా 8వ పేజీలో)



మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపంలో కొనసాగుతున్న ఏర్పాట్లు

నేడు పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన

కల్లూరుగూడెంలో ఏర్పాట్లు పూర్తి

వేంసూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో వేంసూరు మండలం కల్లూరుగూడెంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి ఆదివారం శంకుస్థాపన జరగనుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హాజరవ్వనున్నారు. కల్లూరుగూడెంలోని 42 ఎకరాల్లో సుమారు రూ.70 కోట్లతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని నిర్మించనున్నారు. ఇది ఖమ్మం జిల్లా పరిధిలో మొదటిది కావడంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. 17 టీపీహెచ్ నుంచి 60టీపీహెచ్ వరకు సామర్థ్యం కలిగిన ఈ ఫ్యాక్టరీని 11నెలల్లోనే పూర్తి చేయనున్నారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణంతో సత్తుపల్లి నియోజకవర్గంలో 15వేల ఎకరాల్లో సాగుచేస్తున్న 3800మంది ఆయిల్ పామ్ రైతులకు లబ్ధిచేకూరనుంది. దీంతో దమ్మపేట మండలంలోని అప్పారావుపేట వరకు వెళ్లకుండా సమయంతోపాటు రవాణా భారం తగ్గనుండగా జిల్లాలో ఆయిల్ పామ్ సాగు గణనీయంగా పెరగనుంది.

నేటినుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- జమలాపురంలో ఆధ్యాత్మిక సందడి
- 4న కల్యాణం.. తెప్పోత్సవం
- 7న చక్రస్నానంతో ఉత్సవాల ముగింపు

ఎర్రుపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉగాది కలశస్థాపన చేసి ఆలయ సాంప్రదాయం ప్రకారం ఉప్పల వంశీయులు తీర్థపు బిందెను తెచ్చి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. అదేరోజు రక్షాబంధనం చేసి దీక్షాధారణ గావిస్తారు. ఈ 9రోజులు రుగ్వేద, వైదిక, స్మార్త, ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ సాంప్రదాయంలో ఒక్కొక్క రోజు విశిష్ట పూజలు, హోమాలు, అనుష్టానాలు జరుపుతారు. ప్రతిరోజు సాయంకాలం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు ఒక్కొక్క వాహనంపై గిరిప్రదక్షిణ చేస్తారు. ఈ నవరాత్రుల్లో శ్రీవారికి సుప్రభాత సేవ, ప్రాతఃకాల అర్చనలు, సర్వదర్శనం, ఆర్జితసేవలు కొనసాగిస్తారు. ఖమ్మం నగరానికి చెందిన తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు (మిగతా 8వ పేజీలో)

ఆత్మగౌరవ ప్రతీక టీడీపీ

- తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుంది
- నేతలు వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్
- ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్ తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల గుండెల్లో తెలుగుదేశం పార్టీ చిరస్మరణీయంగా ఉంటుందని టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్ అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం వారు పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాలన్న లక్ష్యంతో 43ఏళ్ల క్రితం ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెను మార్పులను తీసుకొచ్చారన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పరిపాలనను (మిగతా 8వ పేజీలో)

నట్టింట్లో సినిమా లోకం

- మినీ థియేటర్లపై పెరుగుతున్న మోజు
- ఖర్చుకు వెనకాడని ఔత్సాహికులు



సినిమా చూడటానికి ఒకప్పటిలా ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా వినోదం కూడా ఇంటికే నడిచి వచ్చేస్తోంది. ఐదారేళ్ల క్రితం హైదరాబాద్ లాంటి నగరాలకే పరిమితమైన 'ఇంటి సినిమా హాళ్లు' ఇప్పుడు ఖమ్మం నగరానికి వచ్చేశాయి. 9

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్

సన్న బియ్యం రెడీ

ఎల్లుండి నుంచే రేషన్‌షాపుల్లో పంపిణీ



రేషన్ షాపులో సన్నబియ్యం తనిఖీ చేస్తున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉగాది నుంచి సన్న బియ్యం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా పౌర సరఫరాల శాఖ పరిధిలోని దుకాణాలకు సన్నబియ్యం సరఫరా చేశారు. ఇటీవల రేషన్ కార్డులకు అర్హులుగా గుర్తించిన వారికి ప్రస్తుతం బియ్యం వచ్చే అవకాశం లేదు. గతంలో ఉన్న లబ్ధిదారులకు అవసరమైన బియ్యాన్ని మాత్రమే దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. కాగా, జిల్లాలో 748 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 3,83,717 తెల్ల, 27,268 అంత్యోదయ కార్డుదారులున్నారు.

1 నుంచి పంపిణీ : చందన్‌కుమార్, డీఎస్వో

జిల్లాలో అన్ని రేషన్ దుకాణాల ద్వారా ఏప్రిల్ 1 నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం. ఇటీవలె కొత్తగా వచ్చిన రేషన్ కార్డు లబ్ధిదారులకు వచ్చేనెల వరకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పాత రేషన్‌కార్డు దారులకు మాత్రమే వీటిని అందించనున్నాం. లబ్ధిదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలి. నాణ్యమైన బియ్యాన్ని పూర్తి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. బియ్యం తీసుకున్న డీలర్ నుంచి వెంటనే రశీదు కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

లిఫ్టుల నిర్వహణ... ఫైర్ అనుమతులు
చూపించాల్సిందే

ఆంధ్రజ్యోతితో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు



ప్రశ్న: ప్రైవేటు ఆస్పత్రుల్లో లిఫ్టుల నిర్వహణ సక్రమంగా లేవన్న ఆరోపణలు వస్తున్నాయి..?

జవాబు: ఇప్పటివరకు వీటిపై దృష్టి సారించలేని మాట వాస్తవమే. ప్రతి ప్రైవేటు ఆస్పత్రిలో లిఫ్ట్ ఎప్పుడు ఏర్పాటు చేశారు. ఏ కంపెనీ, దానికి ప్రతి నెల నిర్వహణ తీరు వివరాలను తప్పకుండా మాకు అందించాల్సిందే. అంతేకాదు అగ్ని ప్రమాదాల నివారణకు ఉన్న సౌకర్యాలపై ప్రతి ఆస్పత్రి వివరాలు అందించాల్సి ఉంది. లేకుంటే ఆ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం.

ప్ర: ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి అధిక ధరలు ముక్కుపిండి మరీ వసూళ్లు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి...?

జ: ఆస్పత్రిలో ఏ పరీక్షకు ఏ ఫీజు వసూలు చేస్తుందీ విధిగా ప్రదర్శనకు పెట్టాల్సిందే. గైనిక్ ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీ ద్వారా ప్రయోజనం, ఆపరేషన్ ద్వారా దుష్పరిణామాలపై అవగాహన కల్పించేలా బోర్డులు ఏర్పాటు చేయాలి. లేకుంటే ఆస్పత్రులపై చర్యలు తీసుకోనున్నాం.

ప్ర: అధికధరలు వసూలు చేస్తున్న ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వహణపై చర్యలు ఎవరు తీసుకునేది..?

జ: ఎక్కడైనా అధిక ధరలను ప్రైవేటు అంబులెన్స్‌లు వసూళ్లు చేస్తున్నట్టు తెలిస్తే వెంటనే మాకు ఫిర్యాదు చేయవచ్చు. అంబులెన్స్‌లు రోగులను ఇబ్బంది పెడితే ఆ ఆస్పత్రులదే బాధ్యత.

ప్ర: ఎవరికి ఎలా ఫిర్యాదు చేయాలి?

జ: సీఈఏ (క్రిటికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్) సహాయక కేంద్రం ఖమ్మం జిల్లా వైద్యారోగ్యశాఖలో ఉంది. దీనికి సీనియర్ అసిస్టెంట్, ప్రత్యేక అధికారిగా డాక్టర్ వెంకటరమణ ఉన్నారు. వీరికి 9849309022 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ప్ర: జిల్లాలో పీహెచ్‌సీలో ఎలాంటి సేవలు అందుతున్నాయి...?

జ: గ్రామాల్లో విధిగా ఏఎన్‌సీ కేసులను నమోదు చేస్తున్నాం. మహిళలు సాధారణ కాన్పులు జరిగేలా అన్ని పీహెచ్‌సీల్లోనూ చర్యలు తీసుకుంటున్నాం. ఏఎన్‌ఎంల ద్వారా గర్భిణులకు పోషకాహారం పట్ల సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నాం. అంతే కాదు సాధారణ కాన్పులపై అవగాహన కల్పిస్తూ గర్భిణులకు యోగాభ్యాసనం చేయిస్తున్నాం. గొత్తికోయలకు కూడా ప్రతి వారం ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తూ వారికి ఆరోగ్యంపై పూర్తి అవగాహన కల్పిస్తున్నాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్

గ్రానైట్ పరిశ్రమకు ఊపిరి

- రూ.5 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల
- మిగిలిన రూ.14కోట్లు మరో 15 రోజుల్లో...
- ఒక్కో కట్టరుకు రూ.16వేలతో సీనరేజ్ ఫీ,
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు



మీడియాతో మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కష్టాల కడలిలో మునిగితేలుతున్న గ్రానైట్ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఊపిరినిచ్చిందని తెలంగాణ రాష్ట్ర గ్రానైట్ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్లుగా ఎన్నో పరిశ్రమలు మూతపడుతున్నా.. పట్టించుకోని గత పాలకుల కారణంగా పరిశ్రమ మనుగడ ముందుకు సాగలేదని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రానైట్ సమస్యలను తెలుసుకొని కొంత ఆదుకుందని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణాశాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలోని సీక్వెల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, గ్రానైట్ స్లాబ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్ మాట్లాడారు. గ్రానైట్ పరిశ్రమకు రావాల్సిన సబ్సిడీలను గత పదేళ్లుగా అందించకుండ గత పాలకులు ఇబ్బందులు పెట్టారని, ఎన్నోసార్లు సంబంధిత అధికారులను కలిసినా.. ఫలితం లేదన్నారు. పదేళ్లలో ఒక్కసారి కూడా ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం దొరకలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రిని ఏడాదిలో నాలుగుసార్లు కలిసి మా సమస్యలను చెప్పుకున్నామని అన్నారు.

2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి మొట్టమొదటగా గ్రానైట్ పరిశ్రమకు సబ్సిడీలు, స్లాబ్ సిస్టంను అందించారని అన్నారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు కొనసాగించాయని అన్నారు. గత పదేళ్ల నుంచి గ్రానైట్ పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, ప్రభుత్వం సహకరించకపోవటంతో సబ్సిడీలు రాకపోగా, స్లాబ్ సిస్టంను కొనసాగించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. క్వారీ లీజుల విషయంలో మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్, జీఎస్టీ అధికారులతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని పేర్కొన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమల్లో ఉన్న బ్లేడుల ఆధారంగా ఐదు గ్రేడులుగా విభజించిందని, 1 నుంచి 2 బ్లేడులు ఉన్న పరిశ్రమకు నెలకు రూ.16వేలు, 5 నుంచి 7 బ్లేడులు ఉన్న పరిశ్రమకు నెలకు రూ.32వేలు, 14 నుంచి 15 బ్లేడులు ఉన్న పరిశ్రమకు నెలకు రూ.80వేలు, 21 బ్లేడులు ఉన్న పరిశ్రమకు నెలకు రూ.1.28లక్షలు, 25 బ్లేడులు ఉన్న పరిశ్రమకు నెలకు రూ.1.60లక్షలు సీనరేజ్ ఫీని కట్టాలని మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు జీవో నెంబర్ 11ను ఈ నెల 28న జారీ చేశారని తెలిపారు. గతంలో పోల్చుకుంటే 50 శాతానికి పైగా పరిశ్రమకు లబ్ధిచేకూరిందన్నారు. ఈనెల 28న రూ.5 కోట్లు సబ్సిడీ నిధులు విడుదల చేశారని, మరో 14కోట్లు 15రోజుల్లో విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఈ సిస్టం రానున్న మూడేళ్లకు అందుబాటులో ఉంటుందని ప్రతి సంవత్సరం ఐదు శాతం ఎక్సెస్‌తో కలిపి సేనరేజ్ ఫీ కట్టాలని అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ప్రతి ఒక్క గ్రానైట్ పరిశ్రమ యజమాని మినరల్ డీలర్ లైసెన్స్ తీసుకోవాలని పేర్కొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ స్లాబ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలరావు, కోశాధికారి పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు తమ్మినేని సాగర్, టైల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తెడ్డు రమేష్ పాల్గొన్నారు.

వీవీ పాలెం అభివృద్ధికి కృషి

- నాడు ఎన్టీఆర్‌కు అన్నం పెట్టిన గ్రామం ఇది
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రూ.3.10 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఇళ్ల లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందిస్తున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఏర్పాటు సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్టీ రామారావుకు తొలిసారిగా అన్నం పెట్టిన గ్రామ అభివృద్ధికి ఎంతటి కృషి చేసేందుకైనా వెనకడుగు వేయబోనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ రూ.60లక్షల నిధులతో సీసీ రహదారులు, డ్రైనేజీలు నిర్మాణాలు, రూ.2.50కోట్ల నిధులతో ఎన్‌హెచ్‌పీ వెంకటాయపాలెం నుంచి ఖమ్మం బైపాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. 40ఏళ్ల రాజకీయ జీవితంలో వీ వెంకటాయపాలెంతో ఉన్న బంధాన్ని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలోనే వీ వెంకటాయపాలేనికి లిఫ్టు ఇరిగేషన్ మంజూరు జరిగిందన్నారు. తిరిగి ప్రారంభించే అవకాశం తనకు దక్కిందన్నారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ భద్రాచలం పట్టణానికి రూ.100 కోట్లు మంజూరు చేస్తామని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించి పైసా ఇవ్వలేదని, కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి రూ.30కోట్లు మంజూరు చేసిన తర్వాతనే భద్రాచలం వస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 25 మంది రెండు పడకల ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి హక్కు పత్రాలను మంజూరు చేశారు. వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదబాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, కిలారు వెంకటరమణ, మూడ్ శంకర్, కుతుంబాక రాము, కిలారు రామారావు, తగరం ఆదామ్, దారా మాధవరావు, పరిటాల నర్సింహారావు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



'యాసంగి' సంబురం

పుష్కలంగా పండిన వరి.. భారీగా పెరిగిన దిగుబడులు

- ధాన్యం దిగుబడిలో ఎర్రబోయినపల్లి అగ్రస్థానం
- ఎకరానికి సగటున 65నుంచి 70 బస్తాలు
- రూ.40-50వేల ఆదాయం.. యాజమాన్య పద్ధతులే కారణం

కల్లూరు, మార్చి23 (ఆంధ్రజ్యోతి) యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పంట పుష్కలంగా దిగుబడి రావటంతో రైతుల మోములో ఆనందంగా వెల్లువిరిసింది. వాతావరణం అనుకూలించటం, విత్తన ఎంపిలో నాణ్యతను పాటించారు. ఇలా సరైన యాజమాన్య పద్ధతులను రైతులు పాటించారు. దీనికి తోడుగా సాగునీరు పుష్కలంగా ఉంది. ఈ యాసంగిలో వరి దిగుబడి లో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలోనే కల్లూరు మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామం అగ్రస్థానంలో నిలిచిందని చెప్పవచ్చు. ఈ యాసంగి సీజన్‌లో మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో రైతులు 1400 ఎకరాలు వరి పైరు సాగు చేశారు. సాగర్ జలాలను ఆధారంగా చేసుకొని ఈ ప్రాంతంలోని రైతులు యాసంగి వరి పంటను డిసెంబరు నెలలో సాగు (నాట్లు) ప్రారంభిస్తారు. అందుకు భిన్నంగా ఈసీజన్‌లో ఈ గ్రావ రైతులు నవంబరు మొదటి వారంలో వేదజల్లే పద్ధతిపై వరి సాగు చేశారు. ప్రధానంగా వరి విత్తనంలో బీ గ్రేడులో పీఆర్ (పంజాబ్) 126 రకం 95 శాతం మంది రైతులు వరి సాగు చేశారు. సన్న రకం హెచ్‌ఎంటి విత్తనం సాగు చేశారు. నవంబరు నెల మొదటి వారం నుంచి ఈ వరి రకం పంట 135రోజుల్లోనే దిగుబడికి వచ్చింది. ఇలా ఎకరానికి సగటున 60 నుంచి 70 బస్తాల ధాన్యం (77 కిలోల) దిగుబడి అయింది. పెట్టుబడి మాత్రం ఈ యాసంగిలో సగటున ఎకరం సాగుకు రూ.30 వేలు కాగా, దిగుబడి అయిన ధాన్యంను ప్రైవైట్‌గా మార్కెట్లో అమ్మగా పెట్టుబడి పోను ఎకరానికి రూ.40 నుంచి రూ.50 వేలు వరకు ఆదాయంగా ఉందని వైబీ పల్లి రైతులు చెప్తున్నారు. వరి కోతల యంత్రాలతో వైబీ పల్లి గ్రామంలో సందడి నెలకొంది. వరంగల్ తదితర ప్రాంతాల నుంచి వైబీ పల్లి గ్రామానికి పలువురు రైతులు సందర్శించి యాసంగిలో అధిక దిగుబడి సాధించిన వరిపైరుపై స్థానిక రైతులను సంప్రదించి ఆరా తీశారు.

యాజమాన్య పద్ధతులను పాటించాం



పోట్రు అర్జునరావు, వైబీ పల్లి రైతు

వరి సాగులో రైతుల మధ్య పోటీతత్వం ఉంది. దీంతో సరియైన యాజమాన్య పద్ధతులను అనుసరించాం. ఈ యాసంగి సీజన్‌లో ఒక నెల ముందుగా (నవంబరులో) వరి సాగు ప్రారంభించాం. విత్తనం పంజాబ్ రకం పీఆర్ 126 విత్తనం నాటాం. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ యాసంగిలో ఎకరానికి 70బస్తాలు ధాన్యం దిగుబడి వచ్చింది. పెట్టుబడి పోను ఎకరానికి రూ.40నుంచి రూ.50 వేలు వరకు ఆదాయం ఉంది. వాతావరణం అనుకూలించటం, చీడపీడలు అంతగా ఆశించలేదు. ఎరువులను కూడా తగిన మోతాదులో వాడాం. వైబీపల్లి గ్రామంలో 1400ఎకరాల్లో వరి పంట పుష్కలంగా పండింది. రైతులు సంబరపడుతున్నారు. ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకొనే అవకాశం ఉంది.

భద్రాద్రికి బ్రహ్మోత్సవ శోభ



విద్యుత్ దీపాలంకరణ మధ్య రామాలయం

(7వ పేజీ తరువాయి)

ఉదయం వేపపూత ప్రసాద వినియోగం, శ్రీసీతారామచంద్రస్వామి మూలవరులకు పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం నూతన పంచాంగ శ్రవణం చేయనున్నారు. ఇదిలా ఉండగా ఏప్రిల్ 2న ధ్వజపట లేఖనం, 3న గరుడాధివాసం, 4న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, 5న ఎదుర్కోలు, 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీసీతారాముల తిరుకల్యాణం, శ్రీరామ పునర్వసు దీక్ష ప్రారంభం కానుంది. అలాగే ఏప్రిల్ 7న మహా పట్టాభిషేకం, 8న సదస్యం నిర్వహించనుండగా 12న చక్రతీర్థం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశ ఆరాధనలు, శ్రీపుష్పయాగంతో ఉత్సవ సమాప్తి కానుంది.

నిత్యకల్యాణాల నిలిపివేత

ఇదిలా ఉండగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నుంచి ఏప్రిల్ 12వరకు ఆలయంలో నిత్య కల్యాణాలను నిలిపివేయనున్నారు. శనివారం నుంచి ఏప్రిల్ 21 వరకు ప్రభుత్సేవం (దర్బారుసేవ) పవళింపు సేవలు సైతం నిలిపివేస్తారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా ప్రతి రోజు తిరువీధి సేవ నిర్వహించనున్నారు.

నేడు గవర్నర్, సీఎంలకు రాజ పత్రాలు

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామనవమి, మహా పట్టాభిషేకానికి రావాల్సిందిగా ఆహ్వానిస్తూ రా ష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డికి దేవాదాయశాఖ, భద్రాద్రి దేవస్థానం అధికారులు, వైదిక సిబ్బంది రాజ పత్రాలను అందజేయనున్నారు. ఇందుకోసం భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో వైదిక, పరిపాలనా సిబ్బంది రాజధానికి తరలివెళ్లారు.

నేటినుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో ఎర్రుపాలెం ఆలయం

(7వ పేజీ తరువాయి)

నూతనంగా నిర్మించిన వకుళమాత స్టేడియం కల్యాణ మండపంలో ఏప్రిల్ 4న వైభవంగా అలివేలుమంగ పద్మావతి సమేతంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుపనున్నారు. సాయంత్రం గ్రామసేవ, అనంతరం కన్నుల పండువగా తెప్పోత్సవం నిర్వహిస్తారు. శ్రీవారి కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు రావడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడు తెలంగాణ ప్రభుత్వం తరుపున ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. 6న శ్రీరామనవమి, 7న మహాపూర్ణాహుతి, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయి.

ప్రగతి పరుగులు

(7వ పేజీ తరువాయి)

తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మంజూరు చేశారన్నారు. గతంలో మైనింగ్ కాలేజీగా ఉన్న స్కూల్ ఆఫ్ మైనింగ్ కాలేజీని ఇంజనీరింగ్ కాలేజీగా అభివృద్ధి చేశానని, అది ఇప్పుడు విశ్వవిద్యాలయంగా విస్తరించబోతోందన్నారు.

సీతారామ ప్రాజెక్టు అసంపూర్తిగా ఉండగా ముఖ్యమంత్రి సహకారంతో రాజీవ్‌లింక్ కెనాల్‌కు నిధులు మంజూరుచేయించి సాగర్‌కు అనుసంధానం చేశామన్నారు. పినపాక కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా నియోజకవర్గాల్లోని కాలువల డిస్ట్రిబ్యూటరీ పనులకు ప్రభుత్వం సవరించిన అనుమతులకు ఆమోదం తెలిపిందన్నారు. తద్వారా లక్షా 20వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కానుందని తెలిపారు సత్తుపల్లి నియోజకవర్గంలో 80వేల ఎకరాలు స్థిరీకరణ కాబోతుందన్నారు.

భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి ముందుగా భూసేకరణ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చేసిన విజ్ఞప్తి మేరకు వెంటనే స్పందించి రూ.34కోట్లు మంజూరుచేయించారన్నారు. త్వరలో భూసేకరణ పనులు కూడా ప్రారంభమవుతాయని మంత్రి తుమ్మల వివరించారు.

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని, కేంద్ర మంత్రి రాంమోహన్‌నాయుడిని కలిసి విజ్ఞప్తి చేయడంతో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కసరత్తు జరుగుతోందన్నారు. ఈ ఎయిర్‌పోర్టుతో భద్రాచలం దక్షిణ అయోధ్యగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పాండురంగాపురం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని విష్ణుపురం వరకు రైల్వేలైన్ మజూరైందన్నారు. పాండురంగాపురంనుంచి సారపాక వరకు రైల్వేలైన్ ముందుగా నిర్మిస్తే భద్రాచలం వచ్చే పర్యాటకులకు సౌలభ్యంగా ఉంటుందని కేంద్రమంత్రికి సూచించామన్నారు.

తెలంగాణ రాష్ట్రం మొత్తం ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున కేంద్రం నుంచి పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు తీసుకొచ్చామన్నారు. దాంతో అన్ని జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుతో పాటు పరిశ్రమలు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై ముఖ్యమంత్రి కూడా ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.

భద్రాచలం నుంచి ఏటూరునాగారం మీదుగా నాగపూర్ వరకు జాతీయ రహదారి మంజూరు కాబోతుందన్నారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఆగస్టు 15నాటికి పూర్తి చేసి రాకపోకలు ప్రారంభిస్తామన్నారు. కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి పనులు పూర్తయ్యాయని, ఖమ్మం-కురవి రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. రూ.120 కోట్లతో ఖమ్మానికి రింగ్‌రోడ్డు రాబోతోందన్నారు. అలాగే ఖమ్మం-కోదాడ పాత రహదారి మరమ్మతులకు నేషనల్ హైవే అథారిటీ నుంచి రూ.20కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

రాష్ట్రంలో ఉగాది నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. దీనివల్ల రేషన్ బియ్యం మాఫియా నియంత్రణ జరుగుతుందన్నారు. ప్రభుత్వం రైతులకు రూ.500 బోనస్ ఇచ్చి సన్నధాన్యం పండిస్తోందని, తద్వారా రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం అందించబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో గ్రానైట్ పరిశ్రమల యజమానుల సమస్యలు అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, వారి అసోసియేషన్ ఇచ్చిన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి గ్రానైట్ పరిశ్రమల యజమానులకు రాయితీలు కల్పించారన్నారు. తక్షణం రూ.20కోట్లు మంజూరుచేశారని తెలిపారు. రాష్ట్రంలో 90శాతం మంది రైతులకు రైతుభరోసా నిధులు జమ అయ్యాయన్నారు.

ఉగాది శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు, రైతులకు మంత్రి తుమ్మల శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నేషనల్ హైవే అథారిటీ పీడీ దివ్య ఆర్డీవో నరసింహారావు, జేడీఏ పుల్లయ్య, సహకార అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ ప్రతీక టీడీపీ

(7వ పేజీ తరువాయి)

ప్రజల దగ్గరకు తీసుకొచ్చి పాలనలో అనేక మార్పులను తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు , లోకేష్ బాబు పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు.

అనంతరం ర్యాలీగా బయలుదేరి ఎన్టీఆర్ సర్కిల్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఆ తర్వాత కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు, అనంతరం సీనియర్ కార్యకర్తలను సత్కరించారు. నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తా సీతయ్య, మంద వెంకటనారాయణ, మల్లెంపాటి అప్పారావు, మేకల సత్యవతి, మీగడ రామారావు, మందపల్లి రజిని, చంద్ర రవికుమార్, నల్లమల రంజిత్, అబ్దుల్ మజీద్ పాలడుగు కృష్ణ ప్రసాద్, చింతనిప్పు నాగేశ్వరరావు, నాగండ్ల లక్ష్మణ్, తీగుళ్ల రమణ, మురళి, జాతరాజు కనకయ్య, గుండెపిన్ని నాగేశ్వరరావు, పెనుగొండ ఉపేందర్, తాడిశెట్టి స్వాతి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాల్వొడ్డు సెంటర్‌లో అన్నదానం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఖమ్మం మూడో ప్రాంత పరిధిలోని కాల్వ ఒడ్డు ఎన్టీఆర్ విగ్రహం అన్న క్యాంటీన్ నిర్వాహకుడు నల్లమల్ల రంజిత్ ఆధ్వర్యంలోతెలుగుదేశం పార్టీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గుత్తా సీతయ్య, నల్లమల్ల రంజిత్, గుండె పిన్ని నాగేశ్వరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, తాడిశెట్టి స్వాతి, రంగిశెట్టి మంగమ్మ, ఝాన్సీ డివిఎస్ నారాయణ, రమణ, శౌలం లావణ్య, కృష్ణమాచారి ,రత్నకుమారి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు ఆచరణీయం

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచ మానవాళికి ఆచరణీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పుస్కరించుకుని శనివారం సుగుణ గార్డెన్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ముందుగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్త మానవాళి సమానత్వంతో జీవించాలని, విద్వేషాలు, దేశ పురోగతికి సమాజ గమనానికి విఘాతమన్నారు. ఇఫ్తార్ విందు ప్రజల మధ్య ఐక్యత పెంచుతుందని, మత సామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకుందామన్నారు. సమాజంలో శాంతిని నెలకొల్పుతున్న మాసం పవిత్ర రంజాన్ మాసమని, రంజాన్ మాస స్ఫూర్తితో రాగ ద్వేషాలు దూరం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో డీఎండబ్ల్యూవో సంజీవరావు, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మార్వో వివేక్, మునిసిపల్ కమిషనర్ సుజాత, పట్టణ ఎస్‌ఐ సుమన్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, టీపీసీసీ సభ్యులు నాగ సీతరాములు, సీపీఐ రాష్ట్ర నాయకుడు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, ముస్లిం మైనారిటీ నాయకులు నయ్యూం ఖురేషీ, గౌస్, కుర్షిద్, ఫయాజ్, ముర్తుజా అలీ, అస్లాం, రషీద్, రెహమాన్, గౌస్, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, పాల్వంచ పట్టణ ప్రముఖులు డాక్టర్ సూర్యదేవర రామ్మోహన్‌రావు, డాక్టర్ సుధాకర్, కొత్తా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లందుటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా ముస్లీంలకు ఇల్లెందులో శనివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రవికుమార్ పర్యవేక్షణలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'సీతారామ' పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న పోతినేని

కొత్తగూడెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు పెంచి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. శనివారం మంచికంటి భవన్‌లో జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న సాగుభూములన్నింటికి గోదావరి జలాలు సాధించడం కోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా గోదావరి నీళ్ల ఎలా తీసుకువస్తారని ప్రశ్నించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం. బాలనర్సారెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటి సభ్యులు చిరంజీవి, రమేష్ సాంబశివరావు, శ్రీనివాసరావు, మండల కార్యదర్శులు పాయం నర్సింహారావు, రామారావు, కిరణ్, వెంకట్రావ్, తుల సీరాం, వాంకుడోత్ కోబల్, దుబ్బ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

పాల్వంచ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేసారు. శనివారం పాల్వంచ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 15శాతం కేటాయించాలని, క్రమంగా దీనిని 20 శాతానికి పెంచాలన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నన్ను శాసించగల ఏకైక వ్యక్తి జక్కంపూడి

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


జక్కంపూడి విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తున్న తుమ్మల

తల్లాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తాను ఏస్థాయిలో ఉన్నా తనను శాసించగల ఏకైక వ్యక్తి సీనియర్ రాజకీయ వేత్త జక్కంపూడి కృష్ణమూర్తి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నెలకొల్పిన జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహాన్ని, సరస్వతీదేవి విగ్రహాన్ని అయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారెళ్ల లక్ష్మణ్‌రావు, గుత్తా వెంకటేశ్వరరావుల అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడారు. కృష్ణమూర్తి 45ఏళ్లుగా తనతోపాటు రాజకీయాల్లో గడిపిన వ్యక్తని ఆయనకు అధికారం, పదవులు లేకపోయినా జిల్లాలో, రాష్ట్రంలో అయన్ను అభిమానించే శక్తి భగవంతుడు కృష్ణమూర్తి ఇచ్చాడని పేర్కొన్నారు. కృష్ణమూర్తి లేకపోవడం తనను ఎంతో బాధిస్తుందని, కృష్ణమూర్తి కుటుంబానికి, ఆయన అభిమానులకు జీవితాంతం అండగా ఉంటానని మాటీ ఇచ్చారు. సభలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ దీక్షా పట్టుదల ఉన్న నాయకుడు కృష్ణమూర్తి అని ఎమ్మెల్యేగా తన గెలుపు కోసం ఎంతో కృషిచేశారన్నారు. సభలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, కోమటి జయరామ్, సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు, టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, వివిధ రాజకీయ ప్రముఖులు తాళ్లూరి వెంకటేశ్వరరావు, కొత్తూరి ప్రభాకర్‌రావు, చల్లగుండ్ల నర్సింహారావు, దుండేటి వీరారెడ్డి, దిరిశాల వెంకట్రామయ్య, కాపా సుధాకర్, స్పందన, జక్కంపూడి కిషోర్, రాము తదితరులు ప్రసంగించారు. కార్లు, బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజన మహిళలు నృత్యాలు డప్పులు, కోలాటనృత్యాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

సీఎం పర్యటనకు రెస్టిన్ వంటకాలు

» నేడు ఖమ్మం నుంచి హుజూర్‌నగర్‌కు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి ఖమ్మం నుంచి రుచికరమైన వంటకాలు వెళ్లనున్నాయి. నల్గొండ జిల్లా హుజూర్‌నగర్‌లో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. ఈక్రమంలో కార్యక్రమంలో పాల్గొనే మంత్రులు, రాష్ట్ర విభాగాల చీఫ్ సెక్రటరీలు, ప్రిన్స్‌పల్ సెక్రటరీలకు ఖమ్మంలోని రెస్టిన్, అమ్మ మెస్ నుంచి వంటకాలను పంపుతున్నారు. ఈ మేరకు శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ఆహార మెనూను పంపారు. దీంతో రెస్టిన్, అమ్మ మెస్ నుంచి వంటకాలను ఆదివారం సిద్ధం చేసి హుజూర్ నగర్‌కు పంపుతున్నారు. వెల్‌కమ్ డ్రింక్‌తో పాటుగా బ్రూంచి, సలాడ్, ఫ్రూట్స్, బ్రెడ్ ఐటమ్స్ శాఖాహారంతో పాటుగా మాంసహార వంటకాలు ఖమ్మం నుంచి వెళ్లనున్నాయి. గతంలో రాష్ట్ర గవర్నర్ పర్యటనలకు కూడా రెస్టిన్, అమ్మ మెస్ నుంచి వంటకాలను అందించి రుచిలో శభాష్ అనిపించుకున్నారు.

నట్టింట్లో సినిమా లోకం



ఖమ్మం కలెక్టరేట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సినిమా అంటే పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టమైన వ్యాపకం. కొత్త సినిమా వస్తే ఉదయమే లేచి టికెట్లకు వరుసలో నిలబడి కుస్తీలు పడేవారు. ఎంత ధర అయినా సొంతం చేసుకునేందుకు ప్రయత్నించేవారు. విడుదలైన రోజే చూడాలన్న తపనతో పల్లెనుంచి పట్టణాలకు వెళ్లేవారు. మీ ఊర్లో ఎన్ని థియేటర్లున్నాయంటూ దూరప్రాంతాల వారు సందర్భం వచ్చినపుడు ప్రత్యేకంగా అడిగేవారు. ఇంటర్నెట్ వినియోగం పెరిగాక ఇంటిదగ్గర నుంచే మనకు కావాల్సిన షో చూసేందుకు టికెట్లు రిజర్వ్ చేసుకునే వెసులుబాటు ఏర్పడింది. ఇక ఇప్పుడు ఇవన్నీ తెరమరుగైపోతున్నాయి. కళ్లు చెదిరే సినిమా థియేటర్లు 'మినీ'గా మారి నట్టింట్లోకే వచ్చేస్తున్నాయి. మహానగరాల్లోనే కాదు మన పట్టణాలు, గ్రామాలకు సైతం ఈ సినిమా అనుభూతి దగ్గరవుతోంది..

మన ఇంట్లో.. మన థియేటర్..

థియేటర్లో సినిమా చూడాలంటే ఇంటిల్లిపాది ఎక్కడికో వెళ్లాల్సిన పరిస్థితి లేదు. ఎవరింట్లో వారు సొంత హాల్లో కోరుకున్న సినిమా భారీ తెర మీద కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హోం థియేటర్ల సంస్కృతి పెరిగిపోతోంది. ఇప్పుడిప్పుడే జిల్లాలో కొందరు ఇళ్లలోనే మినీ సినిమాహాళ్లుగా ముస్తాబు చేకుని కుటుంబ సభ్యులంతా సేదతీరుతున్నారు. అత్యాధునిక సౌండ్ సిస్టం, 70 ఎంఎం తెరలు, ఎల్ఈడీ లైట్లు, మల్టీప్లెక్స్‌కు ఏమాత్రం తీసిపోని రీతిలో సీట్లతో సినిమాహాల్ నట్టింట్లోనే ఆనందం, ఆహ్లాదాన్ని పంచుతోంది.

ఆసక్తికి అనుగుణంగా....!

కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటున్న వారిలో చాలా మంది ప్రత్యేకంగా హోంథియేటర్ కోసం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. ఒక గదినే చిన్నపాటి సినిమాహాలుగా తీర్చిదిద్దుతున్నారు. ప్రొజెక్టర్, స్క్రీన్, 5.1 (5.2.2) ఆడియోసిస్టం ఏర్పాటు చేస్తున్నారు. నిర్మిస్తున్న ఇల్లు, అందుబాటులో ఉండే స్థలానికి అనుగుణంగా మినీ థియేటర్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. స్థలంకొరత ఉన్నవారు ఒకే గదిలో హోం థియేటర్, లైబ్రరీ, మెడిటేషన్, డైనింగేల్.. ఇలా ఎన్నో అవసరాలను సర్దుబాటు చేసుకుంటున్నారు.

ఇంటిల్లిపాదికీ ఆనందం..

ఉరుకుల పరుగుల జీవితంలో పనిఒత్తిడి సర్వసాధారణంగా మారింది. అందరూ కలిసి సరదాగా బయటకు వెళ్దామంటే చాలామందికి సమయం ఉండడం లేదు. ఇలాంటి వారికి ఇంట్లోని మినీ థియేటర్ చక్కని అవకాశంగా వచ్చింది.

» మినీ థియేటర్లపై పెరుగుతున్న మోజు

» ఖర్చుకు వెనకాడని ఔత్సాహికులు

» ఆసక్తికి తగ్గట్లుగా కూర్పు

పెద్దతెర కావడంతో కళ్లకు పెద్దగా ఇబ్బంది లేకుండానే సినిమాలతో పాటు పిల్లలకు ఆన్‌లైన్ పాఠాలు, యూట్యూబ్ వీడియోలు, అయినవారి పెళ్లిళ్లు- శుభ కార్యాల వీడియోలు, నచ్చినసీరియళ్లు ఇలా ఇంటిల్లిపాదీ కలిసి ఏదైనా చూసే వీలు కలుగుతోంది. బంధువులొచ్చినా ఇంట్లోనే కొత్త సినిమా చూసే అవకాశం కలుగుతోంది.

కరోనా తీసుకొచ్చిన మార్పు...

కొవిడ్ సమాజంలో ఎన్నో మార్పులను తీసుకొచ్చింది. కొన్ని విషయాల్లోనైతే కరోనాకు ముందు, కరోనా తర్వాత అన్న పరిస్థితి ఉంది. సినిమారంగాన్ని ఈ వైరస్ బాగా ప్రభావితం చేసింది. సినీప్రియులను కొన్నాళ్ల పాటు థియేటర్లకు దూరం చేసింది. ఏకంగా సినిమాహాళ్లనే ఇంటికి చేర్చింది. ఈ హోం థియేటర్ల సంస్కృతికి ప్రధాన కారణం కరోనానే అని చెప్పుకోవచ్చు. కుటుంబంతో కలిసి సినిమా చూడాలన్న ఆసక్తి తీర్చుకునేందుకు, కొవిడ్ కల్పించిన భయాన్ని అధిగమించేందుకు ఇళ్లలోనే మినీ థియేటర్లు ఏర్పాటు చేసుకున్నారు. అదే సంస్కృతి ఇప్పుడు ఫ్యాషన్‌గా మారిపోయింది. క్రమంగా నగరంలో మినీ, హోం థియేటర్ల సంఖ్య పెరుగుతోంది.


ఇంట్లోనే సినిమా చూస్తున్న ఓ కుటుంబం

పిల్లలతో సరదాగా గడిపే అవకాశం ఉంది

రావూరి సైదుబాబు, ఖమ్మం



బీజీగా ఉండి... సినిమా థియేటర్లకు వెళ్లలేని వారికి ఇళ్లలోనే మినీ థియేటర్ సేదనిస్తోంది. పని ఒత్తిడితో తిరిగి వచ్చి పిల్లలతో సరదాగా గడిపేందుకు ఈ మినీ థియేటర్ ఎంతో దోహదపడుతోంది. ఎంతో ఇష్టంగా పిల్లలు సినిమాలు వారికి ఇష్టమైన అన్ని కార్యక్రమాలు సినిమా అనుభూతితో పొందుతున్నారు. ఆసక్తి ఉన్నవారి స్థాయిని బట్టి ఇంట్లోనే థియేటర్ ఏర్పాటు చేసుకోవచ్చు. కనీసం రూ.3 లక్షల నుంచి రూ. కోటి వరకు ఎంతైనా ఖర్చు చేసుకుని దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.. గది, మన ఆసక్తి, కేబుల్స్, స్పీకర్లు, ఇతరత్రా పరికరాలను బట్టి ధరలు పెరుగుతుంది.

జటాయు వాహనాల పనితీరు పరిశీలన

» కేఎంసీ బడ్జెట్‌లో రెండు వాహనాలకు ఆమోదం

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ ప్రాంతాల్లో ఎప్పటికప్పటి చెత్తను తొలగించేందుకు ఆధునికంగా అందుబాటులోకి వచ్చిన జటాయు వాహనాల పనితీరును ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య శనివారం పరిశీలించారు. ఖమ్మం నగరంలో ప్రధాన రహదారులు, కూడళ్లలో పడే ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వెనువెంటనే వాక్యూమ్ క్లీనర్ తరహాలో తొలగించేందుకు జటాయు వాహనాలను కొనుగోలు చేసేందుకు ఇటీవల జరిగిన కేఎంసీ కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో అమోదం తెలిపారు. దీంతో రెండు జటాయు వాహనాలను ఖమ్మంలోని 3వ డివిజన్‌లో పనితీరును పరిశీలించారు. వీధుల వెంట చెత్తను సేకరించడం, తర్వాత డంప్ చేసే విధానాలను మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, ఈఈ కృష్ణలాల్, డీఈ ధరణ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. జటాయు వాహనాల నిర్వహణకు ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు.


జటాయు వాహన పనితీరును పరిశీలిస్తున్న మేయర్, అధికారులు

చిన్నారులపై పిచ్చికుక్క దాడి..

నేలకొండపల్లి,మార్చి29(ఆంధ్రజ్యోతి): మండలంలో పిచ్చికుక్కలు రెచ్చిపోతున్నాయి. ఎప్పుడు పడితే అప్పుడు, చిన్నా, పెద్దా తేడా లేకుండా దాడి చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఇటీవల నేలకొండపల్లిలో పిచ్చికుక్క దాడిలో ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తాజాగా మండల పరిధిలోని రాయగూడెం గ్రామంలో శనివారం సాయంత్రం ఇంట్లోకి వెళ్లి మరీ చిన్నారులపై పిచ్చి కుక్క దాడి చేయటం గ్రామస్థులను తీవ్రభయభ్రాంతులకు గురి చేసింది. వివరాల్లోకివెళితే శనివారం సాయంత్రం రాయగూడెం గ్రామంలో ఈర్ల కొండలు కుమార్తె మూడు సంవత్సరాల చిన్నారి ఈర్ల జాన్వీపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. అనంతరం ఉప్పలి మనుమడు కట్ల వేదాంత్‌ను ఇంట్లోకి వెళ్లి మరీ తీవ్రంగా గాయపర్చింది. కుక్క కాటుకు గురైన చిన్నారులను నేలకొండపల్లి సీహెచ్‌సీలో చికిత్స అందించారు. దీంతో తేరుకున్న గ్రామస్థులు పిచ్చికుక్కను తరిమి చంపేశారు. కుక్కలను గ్రామంలో నుంచి తరిమేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కోట మైసమ్మ జాతర ప్రారంభం

కామేపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కొత్తలింగాల గ్రామంలో శ్రీ కోటమైసమ్మ తల్లి మూడు రోజుల జాతరను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులు అమ్మవారిని దర్శించుకునే క్రమంలో క్రమశిక్షణ పాటించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఈవో నల్లమోతు శేషయ్య శాలువాతో ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొణిజర్ల, మార్చి29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పల్లిపాడులో జరిగింది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్లిపాడు గ్రామానికి చెందిన నంచర్ల శివయ్యచారి(58) శనివారం ఉదయం కిరాణ సరుకుల కోసం ద్వి చక్రవాహనంతో రోడ్డు దాటుతుండగా కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్లుతున్న రాజధాని ఏసీ ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివయ్యచారి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని పరబ్రహ్మచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేనిసమయంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్తుపల్లి పట్టణం మసీద్ రోడ్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ఆలీబాబా అలియాస్ బన్ను (24) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న యువకుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అతడిని పరిక్షించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి భాషావలి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి హసీనా కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడు ఇటీవల డిగ్రీ సప్లమెంటరీ పరీక్షలు రాయగా, మళ్లీ ఫెయిల్ అవుతానేమోనని భయాందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని సమాచారం.

మామపై అల్లుడి దాడి

» చికిత్స పొందుతూ మామ మృతి

మణుగూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అల్లుడి దాడిలో మామ మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. వివరాల ప్రకారం..వైఎస్ఆర్‌నగర్ గ్రామానికి చెందిన చింతా రాములు (65) కూలీగా పనిచేస్తూ జీవించేవాడు. ఇతని అల్లుడు భద్రాచలం కొర్రాజుల గుట్ట నివాసానికి చెందిన ఆటో డ్రైవర్ దేవబోయిన లింగమూర్తి శనివారం ఇరువురు కలసి మద్యం సేవించారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వివాదం రావడంతో లింగమూర్తి కర్రతో మామపై దాడి చేశాడు. దీంతో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ సంఘటనను చూసిన రాములు కుమార్తె తన తండ్రిని వెంటనే మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించింది. పరిస్థితి బాగా లేకపోవడంతో భద్రాచలం తరలించి వైద్య సేవలందిస్తుండగా రాములు మృతి చెందాడు. కాగా ఈవిషయంపై పోలీసులు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు భద్రాచలం ఆస్పత్రికి చేరుకున్నట్లు సీఐ సతీష్ కుమార్ తెలిపారు.

సింగరేణిలో సోలార్ వెలుగులు

» 245.5 మెగావాట్ల సోలార్ ఉత్పత్తి

» రాజస్థాన్‌లో 1500మెగావాట్ల సోలార్ విద్యుత్ ఏర్పాటుకు రంగం సిద్ధం



రుద్రంపూర్ (సింగరేణి), మార్చి 29(ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్‌వైపు సింగరేణి పరుగులు పెడుతోంది.. సోలార్ విద్యుత్‌ను తయారు చేయడం ద్వారా సంస్థ అవసరాలతోపాటు రాష్ట్ర అవసరాలకు వినియోగించే విధంగా చర్యలు చేపట్టింది. సింగరేణి యాజమాన్యం 300మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను మూడు విడతల్లో తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోంది. 300మెగావాట్ల లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ 245.5 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను తయారు చేస్తోంది. రాజస్థాన్ రాష్ట్రంలోను సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే సింగరేణికి సంబంధించిన ఉన్నతాధికారులు రాజస్థాన్ ప్రభుత్వంతో చర్చలు జరిపి ఒప్పందం కుదుర్చుకున్నారు. రాజస్థాన్‌లో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసేందుకు డీజీఎం స్థాయి అధికారులను డిప్యూటేషన్‌పై పంపించారు. సింగరేణి పరిధిలోని వివిధ ఏరియాల్లో 245.5 సోలార్ విద్యుత్‌ను నెలకొల్పగా వాటి ద్వారా 346.14 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

మొదటి విడతలో 129 మెగావాట్ల విద్యుత్‌ను తయారుచేసేందుకు బీహెచ్ఈఎల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని విజయవంతం చేసింది. సింగరేణి పరిధిలోని ఇల్లెందు ఏరియాలో 39మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, మణుగూరులో 30మెగావాట్లు, ఎస్టీపీపీలో పది మెగావాట్లు, రామగుండంలో 30 మెగావాట్లు, భూపాలపల్లిలో 20మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తిని చేయగా, రెండో విడత అదాని కంపెనీ ద్వారా కొత్తగూడెం ఏరియాలో 37మెగావాట్లు, మందమర్రిలో 28మెగావాట్లు, కాజీపేటలో 15, బెల్లంపల్లిలో 10, మూడో విడతలో ఎస్టీపీపీ బ్లోటింగ్ రిజర్వాయర్‌లో 5శాతం, కొత్తగూడెంలో 10.5, చెన్నూరులో 11 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో ఖాళీ భూముల్లో సోలార్ విద్యుత్ కేంద్రాలను నెలకొల్పే విధంగా ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నిర్దేశించిన 300మెగావాట్ల సోలార్‌కు విద్యుత్‌కు అనుగుణంగా 245.5 మెగావాట్ల సోలార్‌ను ఉత్పత్తి చేస్తుండగా, భవిష్యత్‌లో మరిన్ని సోలార్ విద్యుత్ కేంద్రాలను నెలకొల్పేందుకు యాజమాన్యం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. పర్యావరణ పరిరక్షణకు ఎలాంటి ముంపు లేకుండా సహజ వనరులను వినియోగించుకునే దిశగా అడుగులు వేస్తోంది. సింగరేణి సంస్థ అవసరాలకు సోలార్ విద్యుత్‌ను వినియోగించుకుంటున్నట్లు సింగరేణి సోలార్ జనరల్ మేనేజర్ జానకీరాం ప్రకటించారు. సింగరేణి యాజమాన్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సోలార్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పేందుకు అవసరమైన అనుమతులను తీసుకుంటుందన్నారు. విద్యుత్‌కు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన అన్ని అవకాశాలను సద్వినియోగపర్చుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జానకీరాం తెలిపారు.

ఇంటింటా ఉగాది శోభ

» నేడు పలుచోట్ల పంచాంగ శ్రవణాలు

ఖమ్మం ఖానాపురం హవేలీ, మార్చి29 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి నూతన సంవత్సరం ఉగాది పండగ. ఈ ఏడాది శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది. తొలి పండుగగా భావించి ఉగాదిని ఎంతో ఘనంగా జరుపుకుంటారు. కొత్త దుస్తులు, ప్రత్యేక అలంకరణలు,రకరకాల పిండివంటలతో ఉగాది పండుగ కోలాహలంగా ఉంటుంది.అన్నింటికీ మించి షడ్రుచుల సమ్మేళనమయిన ఉగాది పచ్చడి మన సంస్కృతీ, సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు, ఆహారపు అలవాట్లకు అద్దం పడుతుంది. ఇక ఉగాది రోజున నిర్వహించే పంచాంగ శ్రవణం తెలుగు వారి జీవితంలో ఓ భాగం.

హిందువులకు ఏడాదంతా ఏవో ఒక పండుగలు వస్తూనే ఉన్నప్పటికీ ఉగాదికి ఉండే విశిష్టత,ప్రాధాన్యత మరే పండుగకూ ఉండదు.ఉగాది రోజు ఇంటికి మామిడితోరణాలు కట్టి కుటుంబ సభ్యులు కొత్త దుస్తులు దరించి ఇంట్లో పూజలు నిర్వహించి దగ్గరలోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. అనంతరం సాయంత్రం జరిగే పంచాంగశ్రావనంలో పాల్గొంటారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ఆలయాలు ఉగాది పండుక వేడుకలుకు సిద్ధంచేశారు. ఆలయాల్లో సాయంత్రం పంచాంగశ్రావణం చెప్పేందుకు ఏర్పాట్లు చేశారు. నగరంలోని లక్ష్మీ నరసింహాస్వామి ఆలయం, కమాన్‌బజార్ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఇందిరానగర్ రామాలయం(పర్ణశాల), గుంటుమల్లేశ్వరస్వామి ఆలయం, అభయ వెంకటేశ్వర స్వామి ఆలయాల తోపాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రావణం నిర్వహించనున్నారు.


నీలాద్రి ఆలయ ఈవోగా రజనీకుమారి

పెనుబల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలో గల నీలాద్రీశ్వర ఆలయ కార్యనిర్వహణ అధికారి(ఈవో)గా రజనీకుమారి బాధ్యతలు చేపట్టారు. గత 12 ఏళ్లుగా ఆలయ ఈవోగా సేవలందించిన పాకాల వెంకటరమణ భద్రాద్రి కొత్తగూడెం అన్నపురెడ్డిపల్లిలోని వేంకటేశ్వరస్వామి, శివాలయాలకు బదిలీ అయ్యారు. రజనీకుమారి ఇప్పటివరకు పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయ ఈవోగా పని చేస్తూ బదిలీపై నీలాద్రీశ్వరస్వామి ఆలయానికి వచ్చారు. గతంలో నీలాద్రీశ్వర ఆలయంలో రజనీకుమారి ఆలయ ఈవోగాను పని చేశారు. ఆమె నియామకం పట్ల చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

డీఎంహెచ్‌వో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి29(ఆంధ్రజ్యోతి): తోటి మహిళా ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్రనాయక్ ఉత్తర్వులను విడుదల చేశారు. భద్రాద్రి జిల్లాలో పని చేస్తున్న ఓ మహిళ ఉద్యోగి వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తుంది. ఆ ఉద్యోగి పట్ల డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నరాజ్ అమర్యాదగా, అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. చేసేదేమిలేక ఆ ఉద్యోగి రాష్ట్ర డీహెచ్ కార్యాలయానికి ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన అధికారులు తమ నివేదికను డీహెచ్ కార్యాలయానికి అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా సీనియర్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీహెచ్ డాక్టర్ రవీంద్రనాయక్ ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ సంఘటనపై డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్‌ను వివరణ కోరగా హైదరాబాద్ రాష్ట్ర డీహెచ్ కార్యాలయం నుంచి రత్నరాజ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు తమ కార్యాలయానికి అందాయని తెలిపారు. ఈ ఉత్తర్వులను సంబంధిత విచారణ ఎదుర్కొన్న సీనియన్ అసిస్టెంట్‌కు అందజేసినట్లు శనివారం స్పష్టం చేశారు.

5 కేజీల గంజాయి పట్టివేత


గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మణుగూరు టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ టెంపుల్ వద్ద అక్రమంగా రవాణా అవుతున్న 5 కేజీల గంజాయిని నిందితులతో సహా శనివారం పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల గ్రామానికి చెందిన బీమిశెట్టి మహేష్, హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌కు చెం దిన షేక్ ఉమర్ అనే ఇద్దరు వ్యక్తులు ఆం ధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు సమీపంలో గల నాగులూరు ప్రాంతం చెందిన త్రిమూర్తులు వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని మహేష్, ఉమర్‌లు ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌లో విక్రయించేందుకు అశ్వాపురం నుంచి మణుగూరు మీదు గా వెళ్తుతుండగా పోలీసులు పట్టుకున్నారు. గంజాయి విక్రయించిన వ్యక్తి త్రిమూర్తులు పరారీలో ఉన్నాడు. గంజాయి విలువ రూ.లక్ష ఉంటుందని, మహేష్, ఉమర్లను అరెస్టు చేసి ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ సతీష్ కుమార్ తెలిపారు. మణుగూరు ఇన్‌చార్జి ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్స్ పుల్లం దాస్, సత్యనారాయణ, రవీందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి నవమి వైదిక బృందం ఎంపిక

భద్రాచలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధ రామక్షేత్రంగా భాసిల్లుతున్న భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఏప్రిల్ 12వరకు వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. రామయ్య కల్యాణం బ్రహ్మోత్సవాలను పాంచరాత్రగమ శాస్త్రోక్త విధానంగా సంప్రదాయానుగుణంగా నవాహ్నిక దీక్షతో ఇక్కడ నిర్వహిస్తారు. ఈసారి బ్రహ్మోత్సవాలలో అధ్వర్యులుగా స్థానాచార్యులు కొమాండూరి ఇళయవెల్లి స్థలశాయి, ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్యులు, అమరవాది విజయరాఘవన్‌ల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. కాగా విజయరాఘవన్ ఆచార్యులుగా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు. బ్రహ్మగా ఉప ప్రధాన అర్చకుడు అమరవాది శ్రీనివాస రామానుజం, మంత్రపఠనం ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, ప్రధాన రుత్వికులుగా ఉప ప్రధాన అర్చకుడు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, రుత్వికులుగా ముఖ్య అర్చకుడు పొడిచేటి రామభద్రాచార్యులు, అర్చకుడు, అమరవాది వెంకట్రామన్, అలంకార రుత్వికులుగా ఉప ప్రధాన అర్చకుడు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, అర్చకుడు అమరవాది శ్రీకాంతాచార్యులు పాల్గొననున్నారు.

శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణంలో కీలకపాత్ర ఆధ్వర్యులదే. ఆచార్యులు, ఆచార్య బ్రహ్మలకు తగుసూచనలు, సలహాలు ఇస్తూ కల్యాణం నిర్వహిస్తారు. సీతారామచంద్రస్వామి కల్యాణం సమయంలో ఆచార్య బ్రహ్మ మంత్రాలు పఠిస్తుంటే, ఆచార్యులు కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. వీరికి రుత్విక్‌లు సహకారం అందిస్తారు.

దేవస్థానం వైదిక వాయిద్య సిబ్బందికి ఉగాది పురస్కారాలు


కృష్ణమాచార్యులు


లక్ష్మి

భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న వైదిక, వాయిద్య సిబ్బంది ఇరువురు 2025 రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారానికి ఎంపికైనట్లు విశ్వసనీయ సమాచారం. దేవస్థానంలో రామాయణ పారాయణదారుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్‌టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, వాయిద్య బృందంలో శృతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వై. లక్ష్మీలు ఎంపికైనట్లు తెలిసింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉగాదిని పురస్కరించుకుని జరిగే వేడుకలలో వీరికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉగాది పురస్కారాలను అందజేయనున్నారు.

ఆంధ్రజ్యోతి KHAMMAM CITY

ఆదివారం 30 మార్చి 2025

● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి

ఖమ్మం సిటీ ZONE

నేటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ 4వ డివిజన్ పరిధిలోని యూపీహెచ్ కాలనీలో వేంచేసియున్న శ్రీ భూ సమేత శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి వారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. 30న సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణ, 31న మూలవరులకు అష్టోత్తర శతకలశస్నపన సామూహిక కుంకుమ పూజ, 1న విశేష అలంకరణ, స్వామివారి ఎదుర్కోలు సంవాదం, అనంతరం స్వామి వారి కల్యాణం, సాయంత్రం ఊరేగింపు, 2న సుదర్శన హోమం, 3న వసంతోత్సవం, చక్రస్నానము, మహాపుష్పాభిషేకం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించనున్నారు.



పంచాంగ శ్రవణం నేడు

నేలకొండపల్లి, మార్చి29 (ఆంధ్రజ్యోతి): నూతన తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉగాది పర్వదినం రోజైన ఆదివారం సాయంత్రం నేలకొండపల్లిలోని ప్రసిద్ధ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఈవో శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 6గంటలకు అర్చకుడు తూపురాణి మధుసూధనాచార్యులు పంచాంగ శ్రవణం చేస్తారని ఈవో ప్రకటనలో తెలిపారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గోర్ బోలీ భాషను గుర్తించడం పట్ల హర్షం

ఖమ్మంరూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గోర్ బోలీ బంజారా భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని ఏబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సపవత్ రాములునాయక్ కృషితో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడం పట్ల రూరల్ మండలం బంజారా నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బంజారాలు మాట్లాడే గోర్‌బోలీని ప్రభుత్వం గుర్తించడం గొప్ప విషయమని అన్నారు.

సీపీఎం సానుభూతిపరుడు మృతి

ఖమ్మం రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతిపరుడు జక్కుల రామయ్య(75) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి, ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు నండ్రా ప్రసాద్, షేక్ బషీరుద్దీన్, నాయకులు నందిగామ కృష్ణ, జక్కంపూడి కృష్ణ, నాగేశ్వరరావు, రంజాన్, ముత్తయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావం రాజకీయాల్లో పెను సంచలనం

» పాలేరు ఇన్‌చార్జ్ కొండబాల కరుణాకర్

» ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

నేలకొండపల్లి/ కామేపల్లి/ తిరుమలాయపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం దేశ రాజకీయాల్లో పెను సంచలనమని టీడీపీ పాలేరు ఇన్‌చార్జ్ కొండబాల కరుణాకర్ అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మండలవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. గువ్వలగూడెంలో గత పది సంవత్సరాలుగా వివాదంలో ఉన్న తెలుగుదేశం కార్యాలయం వద్ద సైతం శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ తెలుగు జాతికి మార్చి29 మర్చిపోలేని రోజని, అన్న నందమూరి తారక రామారావును తెలుగుజాతి స్మరించుకునే రోజన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణాలో ఎన్‌డీఏ పాలన రావటం ఖాయమన్నారు. తెలుగుదేశం కార్యకర్తలు ప్రజలతో మమేకమై ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని కరుణాకర్ కోరారు. తొలుత టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల లేసి ఘన నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. గువ్వలగూడెంలో టీడీపీ నాయకుడు గోగినేని లక్ష్మయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆరెకట్ల కొండలరావు, సూరపనేని రామకృష్ణ, తలశీల గోపాలరావు, నలమాస మల్లయ్య పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో టీడీపీ వేడుకల్లో నాయకులు

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు... కామేపల్లి మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ సీఎం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు టీడీపీ జిల్లా నాయకుడు పుచ్చకాయల సత్యనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ద వీరయ్య, సత్యనారాయణ, రామక్రిష్ణ, నర్సింహరావు, రామోజీ, రాఘవయ్య పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి, తిరుమలాయపాలెం, జల్లేపల్లి తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తిరుమలాయపాలెంలో పార్టీజెండాను పార్టీ మండల నాయకుడు కొండబాల కరుణాకర్ ఆవిష్కరించారు.

నేటి నుంచి జోనల్ వ్యవస్థ

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 'ప్రజల వద్దకు ఖమ్మం నగర పాలక సంస్థ పరిపాలన' అనే నినాదంతో ఉగాది పర్వదినోత్సవం నుంచే ఖమ్మంలో జోనల్ వ్యవస్థకు అంకురార్పణ జరగనుంది. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్‌లకు నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్, సెంట్రల్‌గా ఐదు జోన్‌లుగా విభజనకు ఖమ్మం నగర పాలక సంస్థ శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కార్యాలయాల గుర్తింపు, సిబ్బంది నియామకం, జోనల్ వారీగా డివిజన్ల కేటాయింపు జరిగింది. కాగా ఆదివారం వెస్ట్ జోన్ కార్యాలయంగా ఖమ్మం నగరంలోని పాత మునిసిపల్ కార్యాలయంలో జోనల్ కార్యాలయం ప్రారంభానికి సిద్ధం చేశారు. వారం లోపుగా మిగిలిన నాలుగు జోనల్ కార్యాలయాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

'బొమ్మ' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల జేఎన్‌టీయూ ప్రకటించిన నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని బొమ్మ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మెన్ బొమ్మ సత్యప్రసాద్ శనివారం తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

ఘనంగా 'ఆర్జేసీ' వీడ్కోలు వేడుకలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్జేసీ డిగ్రీ కళాశాల 2023-25 విద్యార్థుల వీడ్కోలు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లింగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



రెజోనెన్స్ (శ్రీనగర్‌కాలనీ)



స్మార్ట్ కిడ్జ్



సర్వజ్ఞ

'ఈద్' వేడుకలు

ఖమ్మం ఖానాపురం హవేలీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యాసంస్థల్లో పండుగ వాతావరణం నెలకొంది. శనివారం పలు పాఠశాలల్లో రంజాన్, ఉగాది వేడుకలు జరుపుకొన్నారు. చిన్నారులు ఆయా పండుగలను ప్రతిబింబించే వస్త్రధారణతో ఆకట్టుకున్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మోడల్ నగరంగా ఖమ్మం

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఖమ్మం నగరం మోడల్‌గా నిలుస్తుందని, ప్రకృతి విపత్తులను తట్టుకునేందుకు రూ.250 కోట్లతో అండర్ డ్రెయినేజీ వ్యవస్థను నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని 18వ డివిజన్ శ్రీరామ్‌హిల్స్‌లో రూ.కోటి నిధులతో బీటీ రహదారి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నగరానికి తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రభుత్వం రూ.220 కోట్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా, కార్పొరేటర్ కమర్తపు మురళి, ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాదు రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'చేతన' సేవలు అభినందనీయం



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి, మార్చి29(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థ చేతన ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. నేలకొండపల్లి రైతువేదికలో శనివారం జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 11మంది దివ్యాంగులకు వీల్‌చైర్లు, కోనాయగూడెం, ముదిగొండ మండలం గోకినేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు డిజిటల్ టీవీలు, కోనాయగూడెంలోని ఆయుష్మాన్‌భవ వైద్యశాలకు ఫ్రిడ్జ్‌ను దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా చేతన ఫౌండేషన్ నిర్వాహకులు అందజేశారు. కొంత మంది లబ్ధిదారులకు సహాయ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ నిర్వాహకుడు ముత్తినేని సురేష్, అనిల్, నవీన్ పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ సన్న బియ్యం..

» తహసీల్దార్ రాంప్రసాద్

ఖమ్మం రూరల్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులందరికీప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయనుందని రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ అన్నారు. మండలంలోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదామును శనివారం తహసీల్దార్ రాంప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనున్న సన్న బియ్యం ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందేలా పకడ్బందీగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే సన్న బియ్యం స్టాక్ గోడౌన్లకు చేరుకుందన్నారు. రేషన్ డీలర్లు రిజిస్టర్ నిర్వహిస్తూ సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసు అధికారులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో సీపీ సునీల్ దత్

ఖమ్మంక్రైం, మార్చి29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను పోలీసుకమిషనర్ సునీల్‌దత్ శనివారం తన కార్యాలయంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలంగా వివిధ విభాగాలలో బాధ్యతాయుతమైన సేవలందించి పోలీసుశాఖకు సేవలందించి అధికారులను మన్ననలు పొందారని కొనియాడారు. ఉద్యోగ విరమణపొందిన వారిలో ఎస్ఐలు ఎండీ యాకుబ్, ఎన్.రాము,జి.కృష్ణారావు, ఏఎస్ఐలు ఎస్.నాగేశ్వరరావు, యు.నాగేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్‌కే ఖాజామియా, ఆర్.రామారావు, డి.కృష్ణయ్య, వి.వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, ఏసీపీ నరసయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

నేరాల అదుపులో సీసీ కెమెరాలే కీలకం

» నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్

నేలకొండపల్లి, మార్చి29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాలను అదుపుచేయడంలో సీసీ కెమెరాలు అత్యంత కీలకంగా ఉంటాయని ఎస్ఐ పెంటరి సంతోష్ అన్నారు. కొత్తకొత్తూరులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటానికి రూ.70వేల నగదును కొత్తకొత్తూరుకు చెందిన నాయకులు శనివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పెంటరి సంతోష్‌కు అందజేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ పెంటరి సంతోష్ కోరారు. ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాగర్తి సుధాకర్, చెరువు స్వర్ణ, రుచి రెస్టారెంట్ యజమాని జగదీష్ పాల్గొన్నారు.

మహిళలతో మమేకమైన మంత్రి తుమ్మల



మహిళలతో కరచాలనం చేస్తున్న మంత్రి

రఘునాథపాలెం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మహిళలతో మమేకమైనారు. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెంలో ఎస్సీ సబ్‌ప్లాన్ రూ.60 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఎస్సీ కాలనీలో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న మహిళలు, వృద్ధులతో మంత్రి తుమ్మల మాట్లాడారు. వృద్ధ మహిళలతో కరచలనం చేసి వారి బాగోగులు తెలుసుకున్నారు. బహిరంగ సభలోను మంత్రి మాట్లాడుతూ మహిళలకు ముందుగా మంచినీళ్లు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఓ వృద్ధ మహిళ బహిరంగ సభలో మంత్రి వద్దకు వచ్చి కొతుల బెడద తొలగించాలని కోరారు. మంత్రి తుమ్మల ప్రసంగంలోను తనదైన శైలిలో మహిళలను అభినందించారు.

దళితవాడలకు నిధులు కేటాయించాలి

ఖమ్మం రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దళిత వాడలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కేవీపీఎస్ పాలేరు డివిజన్ కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో శనివారం ముఖ్యకార్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 215 దళిత వాడలున్నాయని అన్నారు. అవన్నీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయని వాటిని వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎల్ఆర్ఎస్ గడువు పెంచాలి: సీపీఎం

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తులు వేలాదిగా ఉంటే ఇప్పటి వరకు కేవలం వందల సంఖ్యలోనే పరిష్కరించారని, ఎల్ఆర్ఎస్ గడువును పెంచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఇళ్ల స్థలం క్రమబద్ధీకరణ జరిగే వరకు ఎల్ఆర్ఎస్ గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

ఒకేదేశం, ఒకే ఎన్నిక నినాదం ప్రజల్లోకి తీసుకెళ్లండి

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు



సుమంత్‌ను సన్మానిస్తున్న కోటేశ్వరరావు

మధిరటౌన్/ఎర్రుపాలెం, మార్చి29(ఆంధ్రజ్యోతి): వన్ నేషన్ వన్ ఎలక్షన్ తో దేశం బలోపేతం అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. శనివారం మధిర, ఎర్రుపాలెంలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ మధిర పట్టణ నూతన అధ్యక్షుడిగా నియమితులైన శివరాజు సుమంత్‌ను ఆయన సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సిలివేరు సాంబశివరావు, నూతక్కి నరసింహారావు, దేవరకొండ కోటేశ్వరరావు, గరికపాటి పురుషోత్తం, కన్నా రామకృష్ణ, పిట్ల గోపాలరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పథకాలపై ప్రచారం నిర్వహించాలి

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. ఏఐసీసీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జైబాపు..జై భీమ్.. జైసంవిధాన్ కార్యక్రమంపై నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో రాచరిక పాలన సాగుతుందని, క్షేత్రస్థాయిలో దానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో అతి శక్తివంతమైన రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, ఏదునూరి సీతరాములు, సూతకాని జైపాల్, పమ్మి అశోక్, నర్వనేని అశోక్, సూరంపల్లి రామారావు, గుగులోతు రాము, మచ్చా బుజ్జి, మట్టూరి వెంకటేశ్వరరావు, చింతనిప్పు మాధవరావు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

» 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జూనియర్ న్యాయవాదులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం సత్తుపల్లి కోర్టులో ఐదేళ్ల లోపు జూనియర్ న్యాయవాదులు, కోర్టు సూపరింటెండెంట్, ప్రాసెస్ సర్వర్లకు, సిబ్బందికి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నిత్యం కొత్తగా వస్తున్న చట్టాలపై ప్రతీ న్యాయవాది అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జే.గోపాలరావు, కోర్టు సూపరింటెండెంట్ బోయినపల్లి రవికుమార్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సాధు కృష్ణయ్య, పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

కల్లూరు, మార్చి29 (ఆంధ్రజ్యోతి): జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో శనివారం కల్లూరులో పేద ముస్లింలకు ఆర్డీవో రాజేంద్రగౌడ్ రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. 130 కు టుంబాలకు అందజేశారు. మోటారు వెహిక ల్ ఇన్‌స్పెక్టర్ సంపుం వెంకటపులయ్య, ఖమ్మం సీఐ హనుక్, అమీరుద్దిన్‌లు తమ వంతుగా రంజాన్ తోఫా పంపిణీకి దాతలుగా ముందుకు వచ్చి రూ.70 వేలు వితరణ చేశా రు. ఈ కార్యక్రమంలో జామాతే ఇస్లామీ హిం ద్ కమిటీ సభ్యులు ఎస్‌డి అమీరుద్దిన్, యస్‌కె సుభాని, జలాలోద్దిన్, జావీద్ ఖాద్రి, మండల ముస్లిం కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అలీ, మసి ద్ సదరు హనీఫ్, కమ్లి, ఇషాక్ పాల్గొన్నారు.

తల్లాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా తల్లాడ మండలంలోని ముస్లింలకు తల్లాడ మసీదులో శనివారం అహ్మద్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. తల్లాడకు చెందిన షేక్.అహ్మద్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు అక్బర్, ఖదీర్‌పాషా ఆధ్వర్యంలో 500మంది కుటుంబాల ముస్లింలకు రంజాన్ సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సదర్ షేక్.మస్తాన్, షేక్.మెహరాజ్, గాలీబ్, మజార్, యూసూబ్, బహదూర్, ముస్తఫా, సైదా పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

కారేపల్లి, మార్చి29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నాయకత్వంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాదు రావు, నాయకులు, తదితరులున్నారు.

మధిర రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా మధిర పట్టణ, మండల ముస్లింలకు శనివారం రాత్రి మధిర షాదీఖానాలోని జామియా మసీదు వద్ద ఇఫ్తార్‌విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, కమిషనర్ సంపత్‌కుమార్, మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, వైస్‌చైర్మన్ అయిలూరి సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సూరంశెట్టి కిషోర్, చావా వేణు, షేక్.జహంగీర్, కర్నాటి రామారావు, దారా బాలరాజు, పాటిబండ్ల సత్యంబాబు, కోనా ధనికుమార్ పాల్గొన్నారు.

'సహకార సంఘం ద్వారా రైతులకు విస్తృత సేవలు'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

మధిర రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మధిర సహకార సంఘం ద్వారా రైతాంగానికి విస్తృత సేవలు కల్పిస్తున్నామని సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం మధిర సహకార సంఘ కార్యక్రమంలో సంఘం ఉద్యోగులు ఏడుకొండలు, గోపిరెడ్డి, బి.శ్రీనివాస్, ఆళ్ల సుబ్బారావు, కేఎన్‌ఆర్ పాల్గొన్నారు.

కల్లూరులో...

కల్లూరు, మార్చి29 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలందించడంలో తమ సొసైటీ అన్ని విధాలుగా ముందంజలో ఉందని చెన్నూరు పీఏసీఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు అన్నారు. శనివారం జరిగిన సహకార సంఘ మహాజన సభలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవోలు దేవరపల్లి మురళి, మట్టా అంజయ్య, డైరెక్టర్లు దేవరపల్లి భాస్కరరావు, పాలెపు పెద రామారావు, మొగిలి రాములు, పరిగడపు వెంకటేశ్వరరావు తదితర రైతులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

బోనకల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బోనకల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని శనివారం జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, ఎంఈవో దామల పుల్లయ్యలు తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరు, సౌకర్యాల కల్పనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరిడెంట్ గోపి చందర్ వారి వెంట ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సురేష్

సత్తుపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని జీవీ మాల్ పక్కనే ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని న్యూస్టార్ ఆసుపత్రి వైద్యులు సురేష్ రామాల శనివారం ప్రారంభించారు. కొన్నేళ్లగా ఏర్పాటు చేస్తున్న చలివేంద్రంతో ఎంతోమంది బాటసారులు, పట్టణ ప్రజలు దాహార్తిని తీర్చుకుంటున్నారని, ఇంకా ప్రధాన కూడళ్లతో పాటు ప్రతిగ్రామంలో చలివేంద్రాలను దాతలు ముందుకు వచ్చి ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సుభాని, గౌస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

వైరా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఎర్రా శ్రీకాంత్ కోరారు. అనుమోలు రామారావు అధ్యక్షతన వైరాలో శనివారం జరిగిన హమాలీల సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుంకర సుధాకర్, మల్లిఖార్జున్, గిరి, శ్రీనివాసరెడ్డి, సైదులు, కృష్ణారావు, లింగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

హాజరు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి

వైరా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వైరా మండల పరిధిలో సామాజిక, ఆర్థిక కుల గణన సర్వే చేసిన ఉపాధ్యాయులకు హాజరు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరుతూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో సరస్వతీ, మునిసిపల్ కమిషనర్ చింతా వేణుకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఏప్రి ల్ రెండోతేదీలోగా ఆ ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని ఎంపీడీవో, కమిషనర్ హామీ ఇచ్చారని పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

వ్యాపారులకు స్టాండ్ గొడుగుల పంపిణీ

సత్తుపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జాతీయ రహదారి వెంబడి ఫుట్‌పాత్‌పై పనిచేసుకునే చిరు వ్యాపారులకు వేసవిలో ఎండల నుంచి రక్షణ కోసం స్టాండ్ గొడుగులను శనివారం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి ఆధ్వర్యంలో ఐదు స్టాండ్ గొడుగులను చిరు వ్యాపారులకు అందజేశారు.

చిన్నకోరుకొండి కార్యదర్శిపై విచారణ

కల్లూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చిన్నకోరుకొండి గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్‌పై పలు ఆరోపణలపై శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్ విచారణ జరిపారు. పంచాయతీ తరుపున చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిధులు డ్రా చేసే విషయంలో, నకిలీ బిల్లులు సృష్టించి నిధులు స్వాహాకు పాల్పడినట్లు స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపారు. నివేదికను అధికారులకు పంపనున్నట్లు తెలిసింది.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



వైరాలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



మధిరలో...



వేంసూర్‌లో....



ఏన్కూర్‌లో...

ఆరు గ్యారెంటీల అమలు కోసం ధర్నా

బోనకల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి సుంకర నరేష్‌కు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, కేవీపీఎస్ మండల నాయకులు బందం శ్రీనివాసరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, గూడిపుడి వెంకటేశ్వర్లు, గార్లపాటి రమేష్, రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.